

## మంగారాణికి విశిష్ట సేవారత్న పురస్కారం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక నాగరాజా ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మోటూరి మంగారాణి, మేడిది సుబ్బయ్య ట్రస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ వారిచే 'విశిష్ట సేవా రత్న" పురస్కారం అందుకున్నారు. ట్రస్ట్ అధినేత డాక్టర్ మేడిది వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా నేడు విద్య, సామాజిక, సాంస్కృతిక, కళారంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురిని గుర్తించి పురస్కారాన్ని అందచేసి సత్కారం చేసినట్టు తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న మంగారాణి

# రైతుకు ఎరువు బరువు

- పెరిగిపోతున్న పెట్టుబడులు
- బస్తాకు రూ.50 నుంచి రూ.230 వరకు పెంపు
- జిల్లాలో 1.88 లక్షల ఎకరాల్లో దాళ్వా వరి సాగు
- రైతులపై రూ.10.10 కోట్ల మేర అదనపు భారం

ప్రజాశక్తి - రాజోలు

రైతుకు పంట పెట్టుబడి కోసం సాయం అందిస్తున్నామంటూనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తిరిగి వారి నుంచి రాబెట్టుకునే పనిలో పడుతున్నాయి. ఎరువులు, పురుగు మందులు, చమురు ధరల పెంపే ఇందుకు ఉదాహరణ. వాటి ద్వారా పరోక్షంగా రైతుల నడ్డి విరుస్తున్నాయి. దీంతో అన్నదాతలు సాగుపై ముందుకు వెళ్లాలా వెనక్కు తగ్గాలా? అన్న అయోమయంలో పడుతున్నారు. రబీ సాగుకు విముఖత చూపుతున్నారు. ఈ ఏడాది ఎరువుల ధరలు పెరిగాయి. ముఖ్యంగా కాంప్లెక్స్ ఎరువుల ధరలను విపరీతంగా పెంచారు. విచిత్రం ఏమిటంటే పెట్రోల్, డీజిల్ వంటి చమురు ధరలు ప్రతీ రోజు పెరుగుతున్న మాదిరిగా ఎరువుల ధరలను పెంచేలా కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తోంది. ఇది దారుణమైన పరిణామం. ఇక నుంచి ఏ రోజుకారోజు ఎరువుల ధరలు మారే పరిస్థితి వస్తుంది. ఇప్పటికే ఖరీఫ్ కలిసిరాక.. దాళ్వా పెట్టుబడులకు సొమ్ములకు ఇప్పటికే సతమతమవుతున్న రైతులపై కాంప్లెక్ ఎరువుల ధరల భారం పడింది.కాంప్లెక్ ఎరువుల బస్తా (50 కిలోలు) ధరలు రూ.50 నుంచి రూ.230 మేర పెరగడంతో జిల్లాలో రైతులపై రూ.10.10కోట్ల మేర అదనపు భారమవుతోంది. సాధారణంగా ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే రబీలో ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఎకరాకు నాలుగు బస్తాలు వరకు రెండు మూడు రకాల కాంప్లెక్స్ ఎరువులు, రెండు బస్తాల యూరియా, అర బస్తా వరకు పొటాష్ వినియోగిస్తుంటారు. జిల్లాలోని 1.88లక్షల ఎకరాల్లో రైతులు రబీ సాగు చేస్తుండగా 80 శాతం మేర నాట్లు పూర్తయ్యాయి. ఈ సీజన్‌లో సుమారు 40.4 వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరమవుతాయని అంచనా.

### రైతుకు ఎరువుపై అదనపు భారం

డిఎపి, యూరియా ధరల్లో మార్పులు లేకపోయినా కాంప్లెక్స్ ఎరువుల ధరలను కంపెనీలు పెంచేశాయి. రానున్న సీజన్‌లో డిఎపి రూ.200లకుపైగా పెరగనున్నట్టు తెలుస్తోంది. రబీలో ఎక్కువగా వినియోగించే 10:26:26 కాంప్లెక్స్ ఎరువు బస్తా రూ.230లు పెరగ్గా, 14:35:14 బస్తా రూ.100, 20:20:013 బస్తా రూ.50 వరకు పెరిగాయి. ఎకరాకు రూ.500 వరకు రైతులపై అదనపు భారం పడుతోంది.



### రైతులను ఆదుకోలేని కూటమి ప్రభుత్వం

వర్షాలు, వరదలు, ప్రతికూల వాతావరణం, చివరిలో దళారుల దోపిడీతో గత ఖరీఫ్ పంట రైతులకు కలిసిరాలేదు. చాలామంది రైతులకు పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి. మరోపక్క కూటమి ప్రభుత్వం నుంచి రైతులకు సాయం కొరవడింది. ఏడాది రూ.20 వేలు ఇస్తామంటూ సూపర్ సిక్స్‌లో ప్రకటించిన అన్నదాత సుఖీభవ సాయం ఇవ్వలేదు. ఖరీఫ్ నష్టపోయిన రైతులకు కనీసం బీమా పరిహారం అందించకపోగా ఈ రబీ నుంచి ఎకరాకు రూ.615 చొప్పున జిల్లా రైతులపై మొత్తంగా రూ.11.56కోట్ల బీమా ప్రీమియం భారాన్ని మోపింది. పంట పెట్టుబడులకు రైతుల దగ్గర డబ్బుల్లేక దాళ్వా సాగులో తీవ్ర జాప్యమవుతోంది. ఈ తరుణంలో కాంప్లెక్స్ ఎరువుల ధరల పెరుగుదల గుబులు పుట్టిస్తోంది. పెరిగిన ధరలు ఇప్పటికే అమలులోకి వచ్చినట్టు ఎరువుల కంపెనీల డీలర్లు చెబుతున్నారు.

**ఎరువుల ధరలు (50 కిలోలు) ఇలా**

| ఎరువు రకం | పాతధర రూ.ల్లో.. | కొత్తధర రూ.ల్లో.. |
|---|---|---|
| 10:26:26 | 1,470 | 1,700 |
| 14:35:14 | 1,700 | 1,800 |
| 20:20:013 | 1,250 | 1,300 |

### యూరియాపైనే ప్రభుత్వ నియంత్రణ

ఎరువుల విషయంలో యూరియాపైనే కేంద్ర ప్రభుత్వ నియంత్రణ ఉంది. కాంప్లెక్స్ ఎరువుల విషయంలో ప్రభుత్వ రాయితీ లేకపోవడంతో ఆయా కంపెనీలు తయారీ ఖర్చు ఆధారంగా ధరలు నిర్ణయించే అవకాశం ఉంది. యూరియా బస్తా (45 కిలోలు) తయారీకి రూ.1614 ఖర్చవుతోంది. కేంద్ర ప్రభుత్వం బస్తాకు రూ.1347.50 రాయితీ భరించి రూ.266.50కు అందిస్తోంది. 50 కిలోల డీఏపీ బస్తాపై రూ.175 చొప్పున ధర పెంచడంతో ప్రస్తుతం రూ.1350గా ఉంది.

### ఎరువుల ధరలు అందుబాటులో ఉండాలి



వాతావరణం కలిసి రాక ఇబ్బందులు పడుతుంటే ఈ ధరల పెంపుతో రైతులపై అదనపు భారం పడుతోంది. రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి. ఎరువుల ధరలను అందుబాటులో ఉంచాలి.

-బుంగ సత్యనారాయణ, కౌలు రైతు బి.సావరం

## ఎల్ఐసిలో విదేశీ పెట్టుబడులు తగవు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రభుత్వ రంగ ఎల్ఐసిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రతిపాదనను తక్షణం విరమించుకోవాలని ఇన్స్యూరెన్స్ కార్పోరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాజమండ్రి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ఆర్‌జె.మాథ్యూస్, ఎం.కోదండరామ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 74 శాతం నుంచి 100 శాతం పెంచడానికి చేసిన ప్రతిపాదనలను అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. నూటికి నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వల్ల బీమా కంపెనీలు పూర్తిగా విదేశ వ్యాపార సంస్థల ఆధీనంలో నడిచే అవకాశం ఉందని, ఇది భారత దేశంలో పాలసీదారుల ప్రయోజనాలకు ఇబ్బంది కలిగించే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 74 శాతం మేర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రాకపోయినా 100 శాతం మేర పెంచడం ఏ విధంగా సరైన నిర్ణయం అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న 25 ప్రైవేటు జీవిత బీమా కంపెనీలలో కేవలం 3 కంపెనీలలో మాత్రమే 49 నుంచి 74 శాతం మేర పెట్టుబడులు వచ్చాయని, అన్ని కంపెనీలలో కలిపి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల సరాసరి 35 శాతం లోపు వుందని, అటువంటి పరిస్థితులలో 100 శాతం పెంపు అవసరం లేదని పేర్కొన్నారు. భారతదేశంలో 1956లో జీవిత బీమా వ్యాపారం జాతీయీకరణకు ముందు సుమారు 245 ప్రైవేటు కంపెనీలు, పాలసీదారులకు సరైన న్యాయం చేయకపోవడం, పాలసీదారుల సొమ్ముకు పూర్తి స్థాయిలో భద్రత లోపించడంతోనే, జాతీయీకరణ జరిగిందన్న విషయం గుర్తుంచుకోవాన్నారు. జీవిత బీమా వ్యాపారం జాతీయీకరణ తర్వాత భారతదేశంలో గత 68 ఏళ్లుగా భారతీయ జీవిత బీమా సంస్థ భారత ప్రజల జీవితాలకు గొప్ప భరోసా కల్పించడంతో పాటు మంచి బోనస్, సేవల ద్వారా పాలసీ దారుల నమ్మకం చూరగొందని తెలిపారు. 100 శాతం ఎఫ్‌డిఐ అనుమతి కోరే కంపనీలు తాము వసూలు చేసేత ప్రీమియం భారత దేశంలోనే పెట్టుబడులుగా పెట్టాలన్నది ఎంతవరకు అమలు అవుతుందో అన్న విషయంలో సందేహాలు తప్పవన్నారు.

## శాస్త్రీయ దృక్పథం పెంపునకు జెవివి కృషి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని జెవివి రాష్ట్ర కార్యదర్శి కెఎంఎంఆర్.ప్రసాద్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా ప్లీనం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జెవివి నాయకులు, కార్యకర్తలు నిబద్ధతతో పని చేయాలన్నారు. ప్రస్తుత కాలంలో మద్యపానం, ధూమపానం, డ్రగ్స్ వాడకం ఎక్కువైందన్నారు. యువత వాటి బారిన పడకుండా జెవివి పనిచేయాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జెవివి గౌరవ అధ్యక్షులుగా ఎం.మల్లికార్జునరావు, వై.పైడియ్య, డాక్టర్ చైతన్య శేఖర్, అధ్యక్షునిగా కె.భీమయ్య, ఉపాధ్యక్షులుగా టి.వసంతరావు, ఎఎన్.సుధారాణి, సిహెచ్.శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా ఎన్.రవిబాబు, కోశాధికారిగా జి.తాతారావు, కార్యదర్శులుగా జి.రాజేష్‌కుమార్, పిఎం.శిరోమణి, కెఎల్.జ్యోతి, సైన్స్ అండ్ టెక్నాలజీ కన్వీనర్లుగా కె.శ్రీకృష్ణసాయి, బిఎల్ఎన్.ఆనంద్‌బాబు, సమతా కన్వీనర్‌గా వై.బేబిరాణి, యూత్ వింగ్ కన్వీనర్‌గా సిహెచ్.నిశ్చల్ ఎన్నికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్



చిన్నారులకు బోధిస్తున్న అనాలయో

## బౌద్ధ ధమ్మ పీఠంలో బాల వికాసం ప్రారంభం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

చిన్నారి బాల బాలికల్లో వికాసం కల్పించేందుకు బాల వికాసం కార్యక్రమం ప్రారంభించినట్లు ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మ పీఠం పీఠాధిపతి భంతే అనాలయో ఆదివారం తెలిపారు. మంచి ఆదరణ పొందిన బాల వికాసం అనివార్య కారణాలతో కొంతకాలం నిలిపివేసినప్పటికీ, చిన్నారులకు వాళ్ల వాళ్ల చదువులతో పాటు వారిలోని సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికి తీసేందుకు తిరిగి మరల ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నీతి సూత్రాలతో పాటు, సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ధ్యానం తదితర అంశాలపై తర్ఫీదు ఇస్తారన్నారు. ఆయా కోర్సులకు సంబంధించి ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా నేర్పుతున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా అనాలయో మాట్లాడుతూ చెడు పనులు, చెడు ఆలోచనలు, దుర్వ్యసనాలు, చెడు మాటలు, ఇతరులకు ఇబ్బంది కలిగించే పనులను మేము చేయము, ఆనందించము అని ప్రతిజ్ఞ చేయించారు. నేటి నుండి ప్రతి ఆదివారం పిల్లలకు ఆటవిడుపుగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

# ఆగని మట్టి మాఫియా ఆగడాలు

- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం
- పర్యవేక్షణ లేని ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి -గోకవరం

ఏజెన్సీ ముఖద్వారమైన గోకవరం మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. దీనిపై సంబంధిత అధికారులుకు స్థానిక ప్రజలు ఎన్నిసార్లు సమాచారం ఇచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదు. మండలంలో పోలవరం కాలువ గట్లు, పుష్కర కాలువగట్లు, మెట్టలు, కొండలు, చెరువులు, కాలువలు సైతం మట్టి మాఫియాదారులకు అడ్డాగా నిలిచాయి. అటు పోలవరం, ఇటు పుష్కర కాలువల గట్లుకు సంబంధించిన అధికారులు గానీ, మెట్టలు, కొండలకు సంబంధించిన అధికారులు గానీ అటు కన్నెత్తి చూసిన దాఖలాల లేవంటున్నారు. దీనిని అనువుగా తీసుకొని మండలంలో యథేచ్ఛగా మట్టి తోలకాలు రోజురోజుకీ మితిమీరిపోతున్నాయి. ప్రయాణికులు రోడ్డుపై వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. ఏ పక్క నుంచి మట్టి లారీలు, ట్రాక్టర్లు వస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. వీళ్ళ ఆగడాలకు అడ్డుకట్ట వేసే నాథుడే లేకపోయినట్టు తెలిపారు. ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో వారి అండదండలతో చెలరేగిన అక్రమ మట్టి మాఫియాలు ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో కూడా అదే దందా కొనసాగిస్తున్నారని ప్రజలు అంటున్నారు. గుప్పిస్తున్నారు. ఈ మట్టి మాఫియాదారులు వెనుక రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని ప్రజల విమర్శలు వెలిజిమ్ముతున్నారు. ఇప్పటికైనా అధికారులు యథేచ్ఛగా సాగుతున్న మట్టి మాఫియా దారులపై చర్యలు తీసుకుని అక్రమ మట్టి మాఫియా దారులకు అడ్డుకట్టు వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కాలువ గట్లు తవేస్తున్న జెసిబిలు

## రహదారులను కమ్మేసిన పొగ మంచు

ప్రజాశక్తి-కడియం, చాగల్లు

ఆదివారం ఉదయం తొమ్మిది గంటలైనా మంచు విపరీతంగా కురియడంతో మండలంలోని వేమగిరి, కడియపులంక, పొట్టిలంక జాతీయ రహదారిపై వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమీప దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తాయేమోనని తమ వాహనాలను నిలుపుదల చేసుకున్నారు. కడియపులంక అంతరాష్ట్ర పూల మార్కెట్‌కు వచ్చే పూల రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చాగల్లులో ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు మంచు కురవడం వల్ల వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణం చేశారు. కొందరు వాహనదారులు మంచు ఎక్కువ కురవడం వల్ల రోడ్ల పక్కనే తమ వాహనాలను నిలిపివేశారు. ఈ మంచు వల్ల మామిడి పూతలు ఇబ్బందిగా ఉంటాయని, మామిడి తోటలకు జీడి మామిడి తోటలకు నష్టం అని రైతులు తెలిపారు.



కడియం జాతీయ రహదారిలో మంచు

## ఎస్ఎంఆర్, విద్యా స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గోకవరం

రాజమహేంద్రవరంలో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో జూబ్లీ మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అబాకస్ ప్రతిభా పోటీల్లో తంటికొండలోని ఎస్ఎంఆర్, గోకవరంలోని విద్యా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి నాలుగు ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ఎస్ఎంఆర్, విద్యా స్కూల్ కస్పాండెంట్ సారేపల్లి రామదుర్గాప్రసాద్ మాట్లాడుతూ జూనియర్ విభాగంలో రెండో తరగతి విద్యార్థిని ఎన్.ప్రవల్లికి మొదటి ర్యాంకు, నాలుగో తరగతి విద్యార్థిని ఎన్.హేమశ్రీ మూడో ర్యాంకు, సీనియర్ విభాగంలో ఏడో తరగతి విద్యార్థినులు వై.హర్షిత, జి.రాజి 2వ ర్యాంకు సాధించారన్నారు. మూడు సంవత్సరాల నుండి అబాకస్ జిల్లా స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ర్యాంకులు సాధించడం గొప్ప విషయమన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కరస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించారు.

# స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణా శిబిరం ముగింపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పిఎంశ్రీ పాఠశాలల్లో వెంటనే స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను ప్రారంభించాలని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారం రోజులుగా జరుగుతున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, టీచర్ ట్రైనింగ్ శిక్షణా కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ శిక్షణలో తూర్పు గోదావరి జిల్లా నుండి 40 మంది, కాకినాడ జిల్లా నుంచి 23 మంది శిక్షణకు హాజరయ్యారు. రాష్ట్ర స్థాయి పరిశీలకులు, ట్రైనింగ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలన్నీ కూడా పాఠశాల స్థాయిలో నిర్వహించాలని, స్కౌట్స్‌కు సంబంధించి పెట్రోల్ ట్రైనింగ్ ఈ నెలలోనే పూర్తిచేసుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి స్కౌట్ శిక్షణకు వెంకటరెడ్డి, నారాయణ, గైడ్ శిక్షణకు కామేశ్వరి రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఎఎంఒ డి.గౌరీ శంకర రావు, జిల్లా గైడ్ కో ఆర్డినేటర్ రాజ్ కుమార్, కాకినాడ జిల్లా గైడ్ కో ఆర్డినేటర్ సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవిఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న స్కౌట్స్ అండ్ గైడ్స్ టీచర్స్

## పలువురికి 'తుమ్మపల్లి' పరామర్శ

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు శాంక అబ్బులు ఇటీవలే హార్ట్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. అదే గ్రామానికి చెందిన చింతల మల్లేశ్వరరావు అనారోగ్యానికి గురయ్యారు. దీంతో వీరిద్దరినీ ఆదివారం జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట గంటా తేజ, వెంకన్న బాబు, సాయి, మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను, సూరపు రెడ్డి నరేష్, గుంటముక్కల చిన్ని, శంక వీరబాబు ఉన్నారు.

## పుట్టినరోజు వేడుకల్లో 'తుమ్మలపల్లి'

ప్రజాశక్తి-గోకవరం


మండలంలోని రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు ఊడి దుర్గాప్రసాద్ కుమార్తె మొదటి పుట్టినరోజు వేడుకకు పార్టీ జగ్గంపేట ఇన్‌ఛాజ్ఞ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి దుర్గాప్రసాద్ కుమార్తెను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సురపరెడ్డి రామకృష్ణ, నవనాసి విష్ణు, గంటా శ్రీను, బోయిడి సుబ్బు, మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను, సూరపరెడ్డి నరేష్ పాల్గొన్నారు.

## రాధాకృష్ణ కుటుంబానికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రు గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు పొట్లచెరువు రాధాకష్ణ తల్లి లింగ వర్ధిని మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, మనుమలు మనమరాలు ఉన్నారు. ఆమె మృతికి సంతాపం తెలిపిన వారిలో అక్కిన గోపాలకృష్ణ మూర్తి, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, తాడిపర్రు గ్రామ సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, ఏసు, సాయి, పలువురు నాయకులు ఉన్నారు.


### కార్టూ'నిజం'




# యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి-కడియం

కడియం పంచాయతీ పరిధిలో ఒక పక్కన పాత ఆక్రమణలు తొలగిస్తుంటే, మరో పక్కన పంచాయతీ రోడ్లను ఆక్రమించి కొత్తగా బహుళ అంతస్తుల భవనాలు యథేచ్ఛగా నిర్మించేస్తున్నారు. కొన్నేళ్లుగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీల నాయకుల అనుయాయులు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. తాజాగా గ్రామంలోని కామిశెట్టి వారి వీధిలో ఒక వ్యక్తి రోడ్డును ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాన్ని దర్జాగా నిర్మించేస్తున్నాడు. ఇటీవలే కడియం దేవీచౌక్ సెంటర్ నుంచి పడాల వారి వీధిలోకి వెళ్లే దారిలో పాత ఆక్రమణలను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తొలగించిన విషయం తెలిసిందే. కానీ దీనికి కూత వేటు దూరంలో నూతన ఆక్రమణ నిర్మాణం చేపడుతుంటే పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కళ్ళప్పగించి చూడడాన్ని స్థానికులు తప్పుబడుతున్నారు. కడియంలో పాలకులు ఎప్పటి కప్పుడు అనుయాయులకు ఒక న్యాయం, సామాన్యులకు మరో న్యాయం, వ్యతిరేకులకు అన్యాయం చేస్తున్నారని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ప్రస్తుత పాలకులు మరో అడుగు ముందుకేసి వ్యతిరేకుల పట్ల మరీ అన్యాయంగా వ్యవహరిస్తున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అను యాయుల తప్పులను భుజాన వేసుకుని మోచేస్తున్నారని, ప్రభుత్వ జాగాలను ధారాధత్తం చేసేస్తున్నారని కొందరు గుసగుస లాడు కుంటున్నారు. తాజాగా కామిశెట్టి వారి వీధి అక్రమ నిర్మాణంపై ఎలా స్పందిస్తారో వేచి చూడాలి మరి.



నిర్మిస్తున్న అక్రమ కట్టడం

## ఘనంగా చిత్తడి నేలల దినోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల (అటానమస్) లోని వృక్ష, భూగర్భ, జంతుశాస్త్ర విభాగాలు ఆదివారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎపి స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ బి.విజయకుమార్ మాట్లాడారు. ప్రపంచ దక్పథంలో చిత్తడి నేలల ప్రాముఖ్యత, పర్యావరణ సేవలను ఆయన వివరించారు. భారతదేశం, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ చిత్తడి నేలల గురించి వివరించారు. ఈ ఏడాది 'మన ఉమ్మడి భవిష్యత్తు కోసం చిత్తడి నేలల పరిరక్షణ' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించి, చిత్తడి నేలల పరిరక్షణపై ప్రచారం చేయమని కోరారు. ఎవి.రమణమూర్తి, అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిత్తడి నేలల (పరిరక్షణ మరియు నిర్వహణ) నిబంధనలు-2017 నుండి కొన్ని భాగాల గురించి వివరించారు. బోటనీ హెచ్ఒడి డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, తన సహచరులు ఎన్.నాగేశ్వరరావు, కె.గనిరాజు, డాక్టర్ కె.నాగేంద్రప్రసాద్, డాక్టర్ ఆర్.వెంకటేష్, బి.బుజ్జిబాబుతో కలిసి ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. విద్యార్థులు ఈ కార్యక్రమానికి ఉత్సాహంగా హాజరై చిత్తడి నేలల పర్యావరణ వ్యవస్థ ప్రాముఖ్యతను తెలుసుకున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్

# నేరాలు ఘోరాలు

## అంతర్ జిల్లా ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

ప్రజాశక్తి - పిఠాపురం

గత కొంతకాలంగా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడి తప్పించుకుని తిరుగుతున్న అంతర్ జిల్లానేరస్తుడు సొంటిని గంగాధర్‌ను అరెస్టు చేసి, అతని నుంచి 48 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌పి బిందుమాధవ్ తెలిపారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ద్విచక్ర వాహనాలను దొంగలిస్తూ తప్పించుకు తిరుగుతున్న పట్టణంలోని అగ్రహారానికి చెందిన అంతర్ జిల్లాల నేరస్తుడు సొంటిని గంగాధర్ (37)ను అత్యాధునిక టెక్నాలజీని, సిసిటివి ఫుటేజీల ఆధారంగా అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అతడు గత ఏడాది కాలంగా జిల్లాలోని పిఠాపురం పట్టణ, రూరల్, ఉప్పాడ కొత్తపల్లి, గొల్లప్రోలు, సర్పవరం, అన్నవరం, తొండంగి, తుని టౌన్‌లతో పాటు, అనకాపల్లి రూరల్ పరిధిలో నమోదు చేసిన 48 కేసుల్లో అతను దొంగతనం చేసి అమ్మిన, అతని వద్ద ఉన్న 48 బైకులను రికవరీ చేసినట్లు తెలిపారు. అలాగే అతని నుంచి వాహనాలను కొనుగోలు చేసిన వారిపైనా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నేరస్తుడిని అరెస్టు చేసిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు.ఈ సమావేశంలో డిఎస్‌పి పాటిల్ దేవరాజ్ మనీష్, సిఐ జి.శ్రీనివాస్, ఎస్ఐలు వి.మణికుమార్, ఎల్.గుణశేఖర్, జి.వెంకటేష్, అదనపు ఎస్ఐ ఎస్‌కె.బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

## మతి స్థిమితం లేని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మతిస్థిమితం లేని ఒక వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. ఎస్ఐ శివనాగు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాళ్లూరు గ్రామానికి చెందిన నీలపు రాంబాబు(37) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు, అనారోగ్య కారణాల వల్ల ఆదివారం ఉదయం 11:30 గంటల సమయంలో మల్లెపల్లి గ్రామ శివారు నీచు గుండాల చెరువు గట్టు వద్ద చనిపోయినట్లు వచ్చిన ఫిర్యాదుపై హెచ్‌సి రమణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## గడ్డి మందు తాగిన వ్యక్తుల మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

గడ్డి మందు తాగి కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ శివనాగు తెలిపారు. మండలంలోని యల్లమెల్లి గ్రామానికి చెందిన పత్తిపాటి శ్రీను(42) గత కొన్నేళ్లుగా కిడ్నీ బాధను అనుభవిస్తున్నాడు. ఎన్ని మందులు వాడినా ఫలితం లేకపోవడంతో మనస్థాపానికి గురియైన అతను ఈనెల 1న గడ్డి మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు అతనిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీను ఆరోగ్యం విషమించడంతో ఆదివారం తెల్లవారు జామున మృతి చెందినట్లు ఆయన తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై హెచ్‌సి రమణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. **గొల్లప్రోలు:** గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం..దుర్గాడ గ్రామానికి చెందిన గొల్లపల్లి రాంబాబు(32) డ్రైవింగ్ పనికి వెళుతుంటాడు. మద్యం అలవాటు కారణంగా డ్రైవింగ్ పనికి సరిగా వినకపోవడంతో చాలా పెళ్లి సంబంధాలు వచ్చిన కుదరనందున మనస్థాపం చెందాడు. బుధవారం ఊరు గ్రామ శివారులో పెద్ద చెరువు గట్టున గడ్డి మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. చూసిన చుట్టుప్రక్కల వారు వాంతులు చేసుకోవడం చూసి తల్లిదండ్రులకు తెలిపారు వెంటనే తండ్రి సత్యనారాయణ తమ్ముడు రాజు పిఠాపురం ఆసుపత్రికి తీసుకువెళ్లగా మెరుగైన వైద్య సేవలు కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించారు చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆరోగ్యం విషమించి ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## చోరీకి పాల్పడిన బాలుడు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని గుమ్మరేగుల గ్రామానికి చెందిన తుమ్మలపల్లి సూరిబాబు ఇంటిలో ఆదివారం చోరీ జరిగింది. బాధితుడు సూరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం ఉదయం 10 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో గల చర్చికి వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఒంటిగంటకు చేరుకునే సమయానికి ఇంటి డోర్ పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో గల రెండు బంగారు సైన్లు, మూడు పెద్ద ఉంగరాలు, రెండు చిన్న బంగారు బిల్లలు మొత్తం సుమారు 27 గ్రాములు బంగారం, ఒక జత వెండి పట్టీలు, రూ.5 వేలు నగదు దొంగలించారని నిర్ధారణకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన చలానానికి చేరుకుని విచారణ చేపట్టారు. సంఘటన స్థలంలో లభించిన ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గ్రామానికి చెందిన సుమారు 15 సంవత్సరాలు బాలుడును సాయంత్రం 6 గంటల సమయంలో బిబీ పట్నం సెంటర్ వద్ద అదుపులోకి తీసుకుని చోరీకి పాల్పడిన బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

## బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - మామిడికుదురు

తల్లి మందలించిందని బాలిక అదృశ్యమైన సంఘటన మండలంలోని బి.దొడ్డవరంలో చోటుచేసుకుంది ఈ సంఘటనపై బాలిక తల్లి సత్యనారాయణమ్మ ఆదివారం నగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇవి.. బి.దొడ్డవరానికి చెందిన మట్టపర్తి ఝాన్సీ (14) పెదపట్నం లంక హైస్కూల్లో 9వ తరగతి చదువుతోంది. ఆమె స్నేహితురాలు వద్ద గొలుసు తీసుకుని మరో స్నేహితురాలికి ఇచ్చానని ఝాన్సీ చెప్పింది. ఆ గొలుసు కలిగిన బాలిక తండ్రితో ఝాన్సీ ఇంటికి వచ్చి తన గొలుసు తనకు ఇచ్చేయాలని వాదోపవాదాలు జరిగాయి ఈ విషయమై శనివారం సాయంత్రం తల్లి మందలించిన కొద్దిసేపటికే బాలిక అదృశ్యమైంది ఇంటి వెనక గోదావరి ఉండటంతో నదిలో దూకేసి ఉంటుందని అనుమానించి గాలింపు చర్యలు చేపట్టారు. ఇంతవరకు బాలిక ఆచూకీ తెలియలేదని దీనిపై కేసు నమోదు చేశామని నగరం ఎస్ఐ చైతన్య కుమార్ తెలిపారు.

# రైతుకు అందుబాటులో ఎరువులు

## ప్రజాశక్తితో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి



రబీ సాగుకు ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్ మాధవరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,99,802 ఎకరాల్లో రైతులు వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య తదితర పంటలు సాగు చేస్తున్నారు. అత్యధికంగా 1.48 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. మినుము, మొక్కజొన్న, పొగాకు, తదితర పంటలను ఈ రబీలో సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎరువుల నిల్వలు, సాగు వివరాలపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రజాశక్తికి పలు విషయాలను వెల్లడించారు.

**జిల్లాలో 1,99,802 ఎకరాల్లో రబీ సాగు**

జిల్లా వ్యాప్తంగా రబీలో సాధారణ సాగు విస్తీర్ణం 1,99,802 ఎకరాలకు గానూ, వరి సాగు 1.48 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతోంది. ప్రధానంగా కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు తాళ్లపూడి మండలాలలో దాదాపుగా నాట్లు పూర్తయ్యాయి. గోకవరం, కోరుకొండ, తాళ్లపూడి, దేవరపల్లి, గోపాలపురం మండలాల్లోనూ నాట్లుదాదాపుగా తుది దశకు చేరుకున్నాయి. కెనాల్స్‌పై ఆధారపడి సాగు జరిగే అనపర్తి, బిక్కవోలు, కడియం, ఉండ్రాజవరం,పెరవలి లోనూ నాట్లు పూర్తయ్యాయి సాగు విస్తీర్ణంతో 93 శాతం నాట్లు పడ్డాయి.

**అందుబాటులో ఎరువులు**

రబీ సీజన్‌కు దశల వారీగా 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉంది. ఇప్పటి వరకూ 73వేల మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు వచ్చాయి. ప్రస్తుతం 2,186 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే మిగిలిన ఎరువులు రానున్నాయి. జిల్లాలో ఎరువుల కొరత లేదు. రైతులకు ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే మండల వ్యవసాయ శాఖ అధికారికి తెలియజేయొచ్చు. ఎరువుల వినియోగంపై రైతులు కూడా అవగాహన కల్గి ఉండాలి. ఒక ఎకరాకు 3 బస్తాల ఎరువు సరిపోతోంది. కొద్దిమంది దిగుబడి కోసం 10 బస్తాలు వినియోగిస్తున్నారు. ఈ విధంగా వినియోగించడం ద్వారా భూమిలో సారం దెబ్బతినే అవకాశం




ఉంది. కావున రైతులు సాగు అవసరం మేరకు ఎరువులు వినియోగించాలి.

**రబీలో సాగునీటికి కొరతలేదు.**

రబీ సీజన్‌లో సాగు నీటికి కొరత లేదు. సుమారు 60 శాతం (1,77,927 ఎకరాలు) బోర్లపై, 18 శాతం గోదావరి డెల్టాలో, 11 శాతం చెరువుల కింద, మరో 11 శాతం ఎత్తిపోతల పథకాల పరిధిలో సాగు చేస్తున్నారు. జిల్లాలో 22,543 హెక్టార్లు మాత్రమే వర్షాధారంగా సాగవుతోంది. జిల్లా వ్యాప్తంగా 15 ఎత్తిపోతల పథకాలున్నాయి. బోర్లు ఉన్న ఆయకట్టులో కూడా కొంతమేర ఈ పథకాల ద్వారా సాగునీరు అందుతోంది. దీంతో సాగునీటి సమస్య తలెత్తే పరిస్థితి లేదు. పశ్చిమ డెల్టా కాలువలపై ఆధారపడి 54,600 ఎకరాలు సాగు చేస్తున్నారు. పెరవలి, రాజమహేంద్రవరం రూరల్, కడియంలో పాక్షికం గా కొన్ని గ్రామాలు గోదావరి డెల్టా పరిధిలో ఉన్నాయి. ధవళేశ్వరం ఆనకట్టకు చేరువలోనే ఉండ డంతో ఈ మండలాల్లో నీటి ఎద్దడి సమస్యే ఉం డదు. మెట్ట ప్రాంతంలో చెరువుల ద్వారా 33,227 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

# కష్టపడి పనిచేసే వారికే నామినేటెడ్ పదవులు

ప్రజాశక్తి - అంబాజీపేట

కష్టపడి పని చేసే నాయకులు, కార్యకర్తలును గుర్తించి నామినేటె పదవులు, పార్టీ పదవులు ఇవ్వడం జరుగుతుందని క్లస్టర్ 9 ఇన్ ఇన్‌ఛార్జి దాసరి వీర వెంకట సత్యనారాయణ అన్నారు. పుల్లేటికుర్రు లో ఆదివారం క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 27 న జరిగే పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించేందుకు కార్యకర్తలు కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎంపిటిసి సభ్యుడు పబ్బినేడి రాంబాబు, దొమ్మేటి సురేష్ కుమార్, రాష్ట్ర ఎస్‌సి కార్యనిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, ఆకుల సూరిబాబు, మంద రాజేష్, యనమదల రాజబాబు ,గంగుమళ్ల వీరభద్రరావు,బొడ్డు సామ్యూల్ రాజు, తిరుమల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



పుల్లేటికుర్రు క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న డివివి

# పచ్చని తివాచీపై మురిసిన పొగ మంచు



తాళ్లరేవులో పచ్చనిపొలాలను ఆవరించిన పొగమంచు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పల్లెల్లోని పంట పొలాలను పొగమంచు కనువిందు చేస్తుంది. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో కూడా మంచు కురియడంతో పంట పొలాలపై దట్టమైన పొగ మంచుతో వ్యవసాయ క్షేత్రాలు శోభామయంగా మారాయి. అయితే పొగ మంచు వల్ల రహదారి కనిపించక ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

**కమ్మేసిన పొగ మంచు**

**సామర్లకోట:** సామర్లకోట ప్రధాన రహదారుల్లో ఆదివారం పొగమంచు కమ్మేసింది. దీంతో దారి మార్గం స్పష్టత లేక వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. ఆదివారం ఉదయం 8 గంటలు గంటలకు దట్టమైన పొగమంచు కురవడంతో సామర్లకోట నుంచి పెద్దాపురం, కాకినాడ, పిఠాపురం, రాజమండ్రి వెళ్లే ప్రధాన రహదారులో పొగ మంచు కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్ల మధ్యలో సైతం మంచు కమ్మేసింది.



పొగమంచుతో సామర్లకోట రోడ్డు

# మహిళ క్రికెట్ టీమ్‌కు అభినందనలు

- మంత్రి వాసంశెట్టి సుభాష్
- అండర్-19 టి- 20 విశ్వవిజేతగా భారత్

ప్రజాశక్తి - రామచంద్రపురం

మహిళల అండర్ -19 టి-20 ప్రపంచ కప్ పోటీల్లో విశ్వ విజేతగా నిలిచిన భారత జట్టుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ వరల్డ్ కప్ ఫైనల్ డిపెండింగ్ ఛాంపియన్ గా అడుగుపెట్టిన భారత టీమ్ అద్భుతమైన పోరాట పటిమతో దక్షిణాఫ్రికాపై 9 వికెట్ల తేడాతో చారిత్రాత్మక విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. తన ఆల్ రౌండ్ ప్రదర్శనతో వరుసగా రెండోసారి భారత్ విశ్వవిజేతగా నిలవడం యావత్ భారతదేశానికి గర్వకారణం అన్నారు. అసాధారణ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులందరిపై ప్రశంసల జల్లు కురిపించారు. తన అద్భుతమైన ఆట తీరుతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ - ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచిన తెలుగు క్రీడాకారిణి గొంగడి త్రిష యావత్ మహిళా లోకానికి ఆదర్శప్రాయమని మంత్రి సుభాష్ ప్రశంసించారు. మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆయన అభిలాషించారు.

# చివటంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చివటం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నీలం తులసమ్మకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గేటు పక్కన, జగనన్న కాలనీకి అనుకొని ఉన్న ఈ ఇంటిలో జరిగిన అగ్ని ప్రమాదంలో గ్యాస్ బండ, స్టౌ పేలిపోవడంతో సమస్తం మంటల్లో కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లినట్టు తెలిపారు. శనివారం తీసుకున్న పెన్షన్ సొమ్ములు సైతం మంటల్లో కాలిపోవడంతో తాను జీవనం కొనసాగించేదెలా అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



మంటల్లో దగ్ధమవుతున్న తాటాకిల్లు.

# మృతుని కుటుంబానికి సూర్యప్రకాష్ పరామర్శ

ప్రజాశక్తి- కె.గంగవరం

ఇటీవల కె.గంగవరంమండలం కె.గంగవరం గ్రామానికి చెందిన ఎస్ఐ ఆదుర్తి గంగాధర సత్యనారాయణ మూర్తి తణుకు పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. మృతుని కుటుంబ సభ్యులను ఆదివారం రామచంద్రపురం నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ తదితరులు పరామర్శించారు. మృతుడు ఎస్ఐ మూర్తి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సూర్యప్రకాష్ వెంట వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



ఎస్ఐ మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పిల్లి సూర్యప్రకాష్

# కుక్కల చర్మవ్యాధులతో ఆందోళన

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలో ఏ గ్రామంలో చూసినా గజ్జి కుక్కలు కనబడడంతో గ్రామస్తుల ఆందోళన చెందుతున్నారు. వీటి గురించి రకరకాల వదంతులు వ్యాప్తి చెందడంతో భయాందోళన చెందుతున్నారు. ఇలాంటి కుక్కలని ప్రభుత్వం గుర్తించి వాటికి వైద్యం చేయించి ఇలాంటి గజ్జి కుక్కలను గ్రామ శివార్లో వదలని స్థానికులు కోరుతున్నారు. రేడియేషన్ కారణంగా వీధి కుక్కలకు అలర్జీలు వస్తాయనే విషయంలో శాస్త్రీయ ఆధారాలు లేవని పశు వైద్యులు డాక్టర్ యు.ముఖేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా కుక్కల్లో అల ర్జీల వల్ల, పర్యావరణ కారకాలు, పుప్పొడి ధూళి, పొడి, కాలు ష్యం, ఆహార అలర్జీలు, చర్మసంబంధ వ్యాధుల వల్ల ఇటువంటి రుగ్మతలు వస్తాయన్నారు. గ్రామ పంచాయతీ వారు అలర్జీలు ఉన్న కుక్కలను పట్టుకుని తీసుకువస్తే వైద్య చేస్తామని, వాటిని తిరిగి వాటి యధా స్థానంలో వదిలిపెట్టవచ్చని తెలిపారు.

## జిల్లాలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - రాజోలు

ఫిబ్రవరి నెల వచ్చినా ఇంకా చలి తగ్గడం లేదు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తగ్గుతూనే ఉన్నాయి. ఉదయం పదిగంటలైనా పొగమంచు వీడట్లేదు. దీంతో ఉదయం, రాత్రి వేళల్లో తలకు టోపీ, ముఖానికి మఫ్లర్‌తోపాటు శరీరానికి రక్షణగా స్వెటర్లు వేసుకొని మాత్రమే బయటకు వెళ్తున్నారు. రాత్రిపూట మరింత మరింత చలి తీవ్రత ఉంటోంది. వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ చలి తీవ్రత మున్ముందు కొన్ని ప్రాంతాల్లో ఉదయం 8 గంటల దాటినా సూర్యుడు కనిపించడం లేదు. ఉదయం వేళల్లో పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్మేస్తుండడంతో జాతీయ రహదారులపై నుంచి రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. లారీలు, డీసీఎం డ్రైవర్లు తమ వాహనాలను గంటలపాటు రోడ్డు పక్కన నిలిపివేస్తున్నారు. కొంత మంది లైట్లు వేసుకుని వెళ్తుండగా మరికొంత మంది మంచు ప్రభావం తగ్గి వెలుతురు వచ్చిన తర్వాతనే వాహనాలను నడుపుతున్నారు.

## పాశర్లపూడి లంకలో నాగ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలంలోని పాశర్లపూడి లంకలో కొలువుతీరిన శ్రీవల్లి దేవసేన సమేత నాగేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దంపతులచే నాగ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఆదిరాజు నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నాగప్రతిష్టాపన జరిపించారు. ఆలయ అర్చకులు గంటి బాలసుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో సోమవారం లక్ష బిల్వార్చన, సహస్ర కుంకుమార్చన పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. ఆలయంలో మంగళవారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ ఈ సందర్భంగా తెలిపింది.



పాశర్లపూడి లంకలో దంపతులచే నాగప్రతిష్టాపన చేయిస్తున్న అర్చకులు

**బి.దొడ్డవరంలో సోమేశ్వరస్వామి ఆలయంలో..**

మండలంలోని బి.దొడ్డవరం లో ప్రజా విరాళాలు రూ.కోటి వ్యయం తో నూతనముగా నిర్మించిన శ్రీ ఉమా సోమేశ్వర స్వామి ఆలయంలో విగ్రహాల, శిఖర ప్రతిష్టాపన కార్యక్రమం జగన్నాథ శర్మ ఆధ్వర్యంలో కంభంపాటి శ్రీనివాస శర్మ, పోచిరాజు వెంకట రామ నాగేశ్వరరావు, పోచిరాజు కిరణ్ కుమార్ దంపతులచే జరిగింది ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పి.గన్నవరం ఎంఎల్ఏ గిడ్డి సత్యనారాయణ, నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు,వివిధ గ్రామాల సర్పంచ్‌లు కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించు కున్నారు ఆలయ కమిటీ ప్రతినిధులు పసుమర్తి నానాజీ, వాకపల్లి వీరాస్వామి, పాబోలు సోమశేఖరరావు, కంభంపాటి సుబ్రహ్మణ్య శ్రీనివాస శర్మ, ప్రణీత్ కుమార్ లను ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక గుర్తు తెలియని మృతదేహాన్ని లభ్యం అయిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం.. మండలంలోని అంకంపాలెం గ్రామ శివారు గోదావరి వశిష్ట నది ఒడ్డున ఆదివారం సాయంత్రం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మతుడు వయసు 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉండవచ్చాన్నారు. దీనిపై విఆర్ఒ ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

## గాయపడిన యువకుని మృతి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

చల్లపల్లి పర్రపేటలో గత నెల 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆదివారం మతి చెందాడు. వివరాలు ఇవి.. మోటార్ సైకిల్‌పై వెళుతున్న పర్రపేటకు చెందిన కుంచే అనిల్ కుమార్ (25)ను లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని ఎ చికిత్స నిమిత్తం అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పేద కుటుంబానికి చెందిన అనిల్ కుమార్ వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని తెలియడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగి తక్షణ వైద్యానికి డబ్బులు సమకూర్చారు. అయినప్పటికీ కాకినాడలోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో అనిల్ కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. అవివాహితుడైన అనిల్ కుమార్ కు తల్లిదండ్రులు, ఇద్దరు సోదరిలు, ఒక సోదరుడు ఉన్నారు. ఈకసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు.

## తనకు, స్థలానికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - రావులపాలెం



రక్షణ కల్పించాలని కోరుతున్న సభ్యులు

ఆక్రమణకు గురైన తన స్థలానికి రక్షణ కల్పించాలని, తనకు న్యాయం చేయాలని రావులపాలెం గ్రామానికి చెందిన మల్లిడి సత్తిరెడ్డి విజ్ఞప్తిచేశారు. ఆయన ఆదివారం విలేకరులకు తెలిపిన వివరాలు ప్రకారం.. తనకు చెందిన స్థలాన్ని అదే గ్రామానికి చెందిన మల్లిడి శ్రీనివాసరెడ్డి నకిలీ పత్రాలను సృష్టించాడన్నారు. నా స్థలాన్ని ఆక్రమించాడన్నారు. మాకు రావులపాడు గ్రామంలో 83.5 సెంట్లు భూమి కలదని సత్తిరెడ్డి తెలిపారు. 2022 లో అప్పటి వైసిపి ప్రభుత్వ అండదండలతో మాకు సరిహద్దు దారుడు, వైసిపి నాయకుడు అయిన మల్లిడి శ్రీనివాస రెడ్డి ఫోర్జరీ సంతకాల తో నకిలీ పత్రాలు సృష్టించి వాటి ద్వారా రెవెన్యూ రికార్డ్స్ మార్చి మా భూమి ఆక్రమించే ప్రయత్నం చేశాడన్నారు. అప్పుడు మేము తహశీల్దార్ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వైసిపి పెద్దల సహకారంతో మాకు న్యాయం జరగకుండా చేశారని సత్తిరెడ్డి అన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కలెక్టర్ ఆఫీసులో మరలా ఫిర్యాదు చేశామన్నారు. మా దస్తావేజులు, రెవెన్యూ రికార్డులు పరిశీలించి అవి సరి అయినవని, అలాగే శ్రీనివాసరెడ్డివి నకిలీ పత్రాలు అని గుర్తించారన్నారు. తిరిగి మా పేరున రెవెన్యూ రికార్డులు సరి చేశారని సత్తిరెడ్డి తెలిపారు. దీనితో ఆ భూమిని ఏదో విధంగా కాజెయ్యాలని శ్రీశివాస రెడ్డి జనవరి 18న నాపై దౌర్జన్యల చేసి నా భూమిని ఆక్రమించుకోవాలని ప్రయత్నం చేశాడన్నారు. నేను అడ్డుపడి మల్లిడి శ్రీనివాసరెడ్డిపై జిల్లా ఎస్‌పి ఆఫీసు లో ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై పోలీసులు విచారణ జరిపి నాకు, నా భూమికి రక్షణ కల్పించారన్నారు. సదరు భూమిలో మరలా జనవరి 31న మల్లిడి శ్రీనివాస రెడ్డి, అతనికి తోడుగా మాజీ ఎంఎల్ఎ జగ్గిరెడ్డి,. అతని అనుచరులు దౌర్జన్యంగా ప్రవేశించి, అడ్డు వచ్చిన పోలీసులను నెట్టుకుంటూ నేను నా స్థలం చుట్టూ వేసుకున్న బౌండరీ క్లాత్‌ను చించి, స్తంభాలు పాడు చేసి బీభత్సం సృష్టించారన్నారు. నన్ను భయ భ్రాంతులకు గురి చేశారని సత్తిరెడ్డి తెలిపారు.. ఈ విషయం పై నేను స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ఈ వైసిపి నాయకుడు మల్లిడి శ్రీనివాస రెడ్డి నుంచి నన్ను, నా కుటంబాన్ని, నా భూమిని కాపాడాలని కోరుతున్నానని సత్తిరెడ్డి అన్నారు.

## పేరాబత్తుల గెలుపుకు సమిష్టిగా కృషి చేయాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కూటమి ఎంఎల్ సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కూటమి నాయకులు సమిష్టిగా కృషి చేయాలని ఎంఎల్‌సి ఎన్నికలకి అబ్జర్వర్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోనంకి కష్ణం నాయుడు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక టిడిపి పార్టీ కార్యాలయం లోఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి కష్ణం నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం కూటమి నాయకులంతా సమిష్టిగా పని చేసి రాజశేఖర్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. వార్డు ఇన్‌ఛార్జ్ లు బాధ్యతలు సమర్థ వంతంగా నిర్వహించాలని దిశనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తుల సాయి, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణ కుమార్, గుద్దటి జమ్మి, పిల్లి నాగరాజు, చిక్కాల అంజిబాబు, విల్ల వీరాస్వామి నాయుడు, గొల్లపల్లి గోపి లతో పాటు పలువురు పాల్గొన్నారు. **ఏలేశ్వరం:** కూటమి పార్టీల అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సిగా గెలిపించేందుకు కృషి చేయాలని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టిడిపి నేత బొదిరెడ్డి గోపి కార్యాలయంలో ఎంఎల్‌సి ఎన్నికల ప్రసార సభలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, కూటమి నాయకులు పెంటకోట మోహన్, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, పింద్రాల శ్రీను, యండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ, మాజీ జడ్‌పిటిసి జ్యోతుల పెదబాబు, చిక్కాల లక్ష్మణరావు, సూతి బూరయ్య పాల్గొన్నారు.



ఉప్పంగలలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని ఉప్పంగల దుర్గ గుడి వద్ద స్థానిక సర్పంచ్ శాఖా శంకరుడు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడారు. ఎక్కువ రోజుల పాటు ఇల్లు తాళం వేసి ఊరు వెళ్లాల్సి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలనని అన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనబడితే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.